సాక్షి
ప్రకాశం

ఆదివారం । 27 । జూలై । 2025



ఎస్సీ బాలుర హాస్టల్లో నిర్లక్ష్యం
ఆడుకుంటూ మంటల్లో పడి విద్యార్థికి గాయాలైన ఘటన సింగరాయకొండ ఎస్సీ హాస్టల్‌లో చోటుచేసుకుంది. - 8లో..



ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలి
బదిలీలు, ప్రమోషన్లు ముగిసి రెండు నెలలైనా ఉపాధ్యాయుల క్యాడర్ స్ట్రెంక్త్, పొజిషన్ ఐడీలు లేక జీతాలు రావడం లేదని యూటీఎఫ్ నాయకులు మండిపడ్డారు. - 8లో..

వాతావరణం
గరిష్టం/కనిష్టం 33 /27

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

28 నుంచి లీడర్షిప్ ట్రైనింగ్
ఒంగోలు సిటీ: పొదిలిలోని జోసఫ్ శ్రీ హర్ష అండ్ మేరీ ఇంద్రజ ఎడ్యుకేషనల్ సొసైటీ కళాశాలలో ఈ నెల 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, ఇటీవల ప్రమోషన్ పొందిన గెజిటెడ్ హెడ్‌మాస్టర్లకు మొత్తం 343 మందికి స్పెల్ 2 లీడర్షిప్ ట్రైనింగ్ నిర్వహించనున్నట్లు డీఈఓ కిరణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయుల జాబితా జిల్లాలోని ఎంఈఓలకు, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్లకు పంపించారని తెలిపారు.

రైల్వే స్టేషన్ తనిఖీ చేసిన డీఆర్ఎం



రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న డీఆర్ఎం సుదేష్నా సేన్

కంభం: కంభం రైల్వే స్టేషన్‌ను శనివారం గుంటూరు డివిజనల్ రైల్వే మేనేజర్ సుదేష్నా సేన్ తనిఖీ చేశారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు పరిశీలించారు. పనుల నాణ్యత, పురోగతిపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఆమెతో పాటు సీపీఎం కె.సైమన్, ఏడీఆర్‌యం రమేష్ కుమార్, డిప్యూటీ సీఈ సూర్య ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నీటిమోత



నీటి కోసం బిందెతో బయటకు వచ్చిన విద్యార్థులు

గిద్దలూరు రూరల్: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలపై పర్యవేక్షణ పూర్తిగా కరువైంది. గిద్దలూరు పట్టణంలోని రాజానగర్‌లోని సెయింట్‌పాల్స్ ప్రైమరీ ఎయిడెడ్ స్కూల్‌లోని ఉపాధ్యాయులు విద్యార్థులను శనివారం మినరల్ వాటర్ కోసం విద్యార్థులకు బిందె ఇచ్చి బయటకు పంపారు. దీంతో ఒక విద్యార్థి మోయలేక మరో విద్యార్థిని తోడుగా తెచ్చుకున్నాడు. అలా ఒకరి తరువాత ఒకరు వంతుల ప్రకారం మోసుకుంటూ పాఠశాలకు తీసుకెళ్లారు. అక్కడి ఉపాధ్యాయులు ముగ్గురు ఉండగా ఎప్పుడూ ఇద్దరే ఉంటున్నారని, ఒకరు బయట ఎక్కువగా తిరుగుతుంటారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థుల దగ్గర ఉండాల్సి ఉండగా.. వారు మాత్రం తినేందుకు ఇళ్లకు వెళుతున్నారు.

నెమలిగుండంలో జలఝరి
రాచర్ల: మండలంలోని జేపీ చెరువు గ్రామ సమీపంలో నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన నెమలిగుండ్ల రంగనాయకస్వామి దేవస్థానం వద్ద ఉన్న నీటి గుండం నుంచి గుండ్లకమ్మ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో నెమలిగుండంలోని జలపాతంలో నీరు ప్రవహిస్తూ చూపరులను ఆకట్టుకుంటోంది. స్వామివారిని దర్శించుకునేందుకు ఆలయానికి శనివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.





హెచ్‌ఎంపాడు ఎస్సీ బాలుర వసతి గృహంలో ఆరుబయట స్నానాలు



పెద్దారవీడు ఎస్సీ హాస్టల్‌లో దుస్తులు ఉతుక్కుంటున్న విద్యార్థులు



పొదిలి బీసీ హాస్టల్‌లో నిరుపయోగంగా మరుగుదొడ్లు



పెద్దదోర్నాలలో ఎస్టీ బాలుర రెసిడెన్షియల్ హాస్టల్‌లో ఆరుబయట నిద్రిస్తున్న విద్యార్థులు

స్వామీ.. కనవేమి!
వసతి.. దుర్గతి

సాక్షి విజిట్

కఠిక నేలపై నిద్ర.. ఆరుబయట స్నానాలు.. అమలు కాని మెనూతో అర్ధాకలి అలమటింపులు ..తలుపులు లేని కిటికీలు.. పనిచేయని డొక్కు ఫ్యాన్లు..దోమల స్వైరవిహారం.. పెచ్చులు ఊడిన పైకప్పులు, పరిశుభ్రత లేని మరుగుదొడ్లు, లీకేజీ నీటి పైపులు..పాత ఇనుప పెట్టెలు.. ఇదీ సంక్షేమశాఖ మంత్రి డోలబాల వీరాంజనేయస్వామి సొంత జిల్లాలో సంక్షేమ హాస్టళ్ల దుస్థితి. వెనుకబడిన తరగతుల విద్యార్థుల భవిష్యత్తుని నిర్దేశించే ఈ ప్రభుత్వ వసతి గృహాలు సమస్యలకు కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. కనీస మౌలిక వసతులు లేక విద్యార్థులు పడరాని పాట్లు పడుతున్నారు. విద్యాశాఖ అధికారులు, ప్రభుత్వ నిర్లక్ష్యంతో సంక్షేమ వసతి గృహాలు కాస్తా.. సంక్షోభ నిలయాలుగా మారాయి. హాస్టళ్ల దుర్గతి 'సాక్షి విజిట్'లో వెలుగులోకి వచ్చింది.



ఒంగోలు అంజయ్యరోడ్డులోని ఎస్సీ వెల్ఫేర్ కాలేజీ బాలుర వసతి గృహంలో ఇరుకు గదిలో దుప్పట్లు లేక నేలపై ముడుచుకుని పడుకున్న విద్యార్థులు

- ఇరుకు గదుల్లో నిద్ర..చదువు
- నేలపైనే పడక..తిరగని ఫ్యాన్లు
- కనిపించని మెనూ..అర్ధాకలితో అలమటింపు
- తాగునీటికీ ఇక్కట్లు
- అధ్వానంగా మరుగుదొడ్లు
- ఆరుబయటే స్నానాలు
- కనీసం కాస్మొటిక్ చార్జీలు లేవు
- దుప్పట్లు లేక గజ, గజలాడుతున్న విద్యార్థులు
- సంక్షేమశాఖ మంత్రి బాల వీరాంజనేయ స్వామి సొంత జిల్లాలో హాస్టళ్ల దుస్థితి

ఒంగోలు వన్‌టౌన్: తినే తిండి నుంచి పడుకునే స్థలం వరకు ప్రతిదీ విద్యార్థులకు సమస్యగానే మారింది. సరైన తిండి లేక, కంటికి సరిపడా నిద్రలేక, అపరిశుభ్ర వాతావరణంలోనే విద్యనభ్యసిస్తున్నారు. ఉదయం లేచిన దగ్గర నుంచి రాత్రి పడుకునే వరకు ఇక్కడి సమస్యలతో యుద్ధమే చేస్తున్నారు. జిల్లాలో సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులు పడుతున్న పాట్లు ఇవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీటి నిర్వహణ మరింత అధ్వానంగా తయారైంది. మెనూ ప్రకారం ఎక్కడగా భోజనం పెట్టడం లేదు. విద్యార్థులకు కనీసం కాస్మొటిక్ కిట్‌లు కూడా ఇవ్వలేదు. చాలా చోట్ల రెండేసి వసతి గృహాలకు ఒక్కరే వార్డెన్ పర్యవేక్షిస్తున్నారు. స్నానపు గదులు అధ్వానంగా ఉండడంతో విద్యార్థులు ఆరుబయటే స్నానాలు చేస్తున్నారు. వసతి గృహాల భవనాలు దెబ్బతిన్నా మరమ్మతులు చేసే దిక్కుకూడా లేకుండా పోయింది. అద్దెభవనాలు..ఇరుకు గదుల్లో విద్యార్థులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. బీసీ సంక్షేమ శాఖ పరిధిలోని 10 వసతి గృహాల్లో మినహా మిగిలిన వసతి గృహాల్లో ఎక్కడా మంచాలు లేవు. 50 కంటే తక్కువ మంది విద్యార్థులున్న వసతి గృహాలను తీసేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ఇప్పటికే ఆరు వసతి గృహాలు నిలిపేసేందుకు రంగం సిద్ధం చేసినట్టు సమాచారం. సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల అవస్థలపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసినా ఎలాంటి మార్పులు రాకపోవడం గమనార్హం.

చలికి గజగజ..
ప్రభుత్వ వసతి గృహాల విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయాల్సిన ప్రభుత్వం నవంబర్ నెల గడుస్తున్నా ఇంత వరకు దుప్పట్ల ఊసెత్తడంలేదు. దీంతో వసతి గృహ విద్యార్థులు చలికి వణుకుతూనే కాలం వెళ్లదీస్తున్నారు.

మంచినీటికి బయటకు వెళ్లాల్సిందే..
చాలా వసతి గృహాల్లో తాగునీరు అందుబాటులో లేదు. ఆర్‌ఓ ప్లాంట్‌లు ఉన్నా నిర్వహణ లేక మూలకు చేరాయి. దీంతో విద్యార్థులు బయట నుంచి తెచ్చుకుంటున్నారు. ఒంగోలు అంజయ్య రోడ్డులోని సాంఘిక సంక్షేమ శాఖ కళాశాలలోని విద్యార్థులు మంచి నీటిని బయట నుంచి ఎవరికి వారు తెచ్చుకుంటున్నారు. కళాశాలకు ఉన్న మంచి నీటి పైప్‌లైన్ 15 రోజుల కిందట పగిలిపోవడంతో అవస్థలు పడుతున్నారు.

మరుగుదొడ్లు లేక అవస్థలు:
కనీసం మరుగుదొడ్లు కూడా లేకపోవడంతో, ఒక వేళ ఉన్నా మురుగు నీరు బయటకు వెళ్లకపోవడం, బాత్ రూం తలుపులు లేకపోవడం తదితర కారణాలతో వాటిని వినియోగించుకోలేకపోతున్నారు.



సింగరాయకొండలో బీసీ వసతి గృహాలకు సరఫరా చేస్తున్న నాశిరకం చిక్కీలు

బహిర్భూమికి బిక్కు, బిక్కుమంటూ బయటకు వెళ్తున్నారు. బాలికల పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. ఒంగోలులోని రెండు వసతి గృహాల్లో సుమారు 300 మంది విద్యార్థినులు ఉన్నారు. వీరికి కనీసం 10 మరుగుదొడ్లు కూడా లేవు. క్యూ లైన్లలో నిరీక్షించి బాత్రూంలకు వెళ్లాల్సిన దుస్థితి. ఫలితంగా వారు సమయానికి కళాశాలకు వెళ్లలేకపోతున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా వసతి గృహాల్లో అధికారులు మరమ్మతులు చేపట్టలేదు.

కాస్మొటిక్ చార్జీల ఊసెత్తని ప్రభుత్వం:
ప్రతి విద్యార్థి స్నానం చేయడానికి సబ్బు, పళ్లు తోముకోవడానికి పేస్టు, పౌడర్ వంటి అత్యవసరమైన కాస్మొటిక్ చార్జీలను విద్యార్థికి రూ.200ల చొప్పున అందించాల్సి ఉండగా ఏడు నెలలుగా చార్జీలు ఇవ్వలేదు. కాస్మొటిక్ చార్జీలు వెంటనే విడుదల చేస్తామని మంత్రి డోలబాల వీరాంజనేయస్వామి చేసిన ప్రకటన అమలుకు నోచుకోలేదు. గతంలో చెల్లించిన చార్జీలు అందరు విద్యార్థుల బ్యాంక్ ఖాతాల్లో జమ కాలేదు. కొంత మందికి మాత్రమే ఇవి అందాయి.

మెనూ పాటించని అధికారులు
సంక్షేమ వసతి గృహాల్లో మెనూ అమలు కావడం లేదు. వసతి గృహాల వారీగా పాలు, పండ్లు, కూరగాయలు, చికెన్, గుడ్లు వంటి వాటిని ఎక్కడికక్కడ కొనుగోలు చేస్తుంటారు. ప్రతి రోజూ గుడ్డు ఇవ్వాల్సి ఉండగా ఇవ్వడంలేదు. ప్రతి రోజూ సాయంత్ర సమయాల్లో విద్యార్థులకు ఇవ్వాల్సిన స్నాక్స్ ఇవ్వడం లేదు.

వేధిస్తున్న సిబ్బంది కొరత
సంక్షేమ వసతి గృహాల్లో సిబ్బంది కొరత నెలకొంది. ప్రతి వసతి గృహంలో కుక్, కమాటి, వాచ్‌మెన్ ఉండాల్సి ఉండగా కుక్, వాచ్‌మెన్ మాత్రమే ఉంటున్నారు. దీంతో ఒకరు సెలవు పెట్టిన సమయంలో ఆహారం వండేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. బీసీ సంక్షేమ శాఖలో వసతి గృహ అధికారుల నియామకాలు జరగకపోవడంతో ఒక్కొక్కరు రెండు, మూడు వసతి గృహాలకు ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్నారు. సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో 81 మంది వార్డెన్లు ఉండాల్సి ఉండగా 57 మంది మాత్రమే ఉన్నారు. బీసీ సంక్షేమ శాఖలో 64 మంది వార్డెన్లు ఉండాల్సి ఉండగా 46 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు.

జిల్లాలోని వసతి గృహాలు : 175	విద్యార్థుల సంఖ్య : 17,250
సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో...	
పోస్ట్‌మెట్రిక్ వసతి గృహాలు : 26	ప్రీమెట్రిక్ వసతి గృహాలు : 55
వసతి పొందుతున్న విద్యార్థులు : 6,700	
బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో...	
పోస్ట్ మెట్రిక్ (కళాశాల) వసతి గృహాలు : 15	
ప్రీ మెట్రిక్ వసతి గృహాలు : 45	
బాలుర హాస్టళ్లు : 50	బాలికల హాస్టళ్లు : 10
వసతి పొందుతున్న విద్యార్థులు : 4,700	
గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో...	
గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు : 15	
గిరిజన గురుకుల పాఠశాలలు : 8	
కళాశాల వసతి గృహాలు : 5	ప్రీ మెట్రిక్ వసతి గృహం : 1



బేస్తవారిపేట ఎస్సీ బాలికల వసతి గృహంలో ఒకే గదిలో కిక్కిరిసి కూర్చున్న విద్యార్థినులు

- బేస్తవారిపేట ఎస్సీ బాలికల వసతి గృహంలో 230 మంది విద్యార్థినులు ఉన్నారు. ఆరు చిన్నపాటి గదుల్లో కిక్కిరిసి ఉండాల్సిన దుస్థితి. ఐదు బాత్‌రూమ్‌లు ఉండటంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.
- త్రిపురాంతకం ఎస్సీ హాస్టల్‌లో 170 మంది విద్యార్థులు కేవలం 4 గదుల్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. దుస్తులు, పుస్తకాలు భద్రపరుచుకునే ట్రంకు పెట్టెలను ఒక చోట చేర్చి విద్యార్థులు ఆ గదుల్లో ఉండాల్సిన పరిస్థితి.
- పెద్దదోర్నాలలోని ఎస్టీ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలలో 8 గదుల్లో 170 మంది విద్యార్థులు బస చేస్తున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఇట్టే అర్థం అవుతుంది. ఆయా వసతి గృహాల్లో మెనూ కూడా సక్రమంగా చేయడం లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు.
- చీమకుర్తి ఎస్సీ బాలికల హాస్టల్‌లో 200 మంది బాలికలు కేవలం 5 గదుల్లో సర్దుకోవాల్సిన పరిస్థితి. సరిగ్గా పడుకోవడానికి స్థలం లేక ఒక పక్కకు తిరిగి పడుకుంటున్నారంటే హాస్టల్‌లో విద్యార్థుల అవస్థలు ఎన్నని చెప్పాలంటూ వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సున్నా అడ్మిషన్లు
సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని కొండపి, దర్శి, సింగరాయకొండ బాలుర వసతి గృహాల్లో ఈ ఏడాది అడ్మిషన్లు జరగలేదు. దీంతో వీటిని ఎత్తేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. అదే విధంగా బీసీ సంక్షేమ శాఖ పరిధిలో కూడా 2 వసతి గృహాలను మూసివేయనున్నట్టు సమాచారం. అలాగే 50 కంటే తక్కువ విద్యార్థులున్న వసతి గృహాలు జిల్లా వ్యాప్తంగా 15 వరకూ ఉన్నట్లు సమాచారం.



సింగరాయకొండ బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థుల ఆరుబయట భోజనాలు



పామూరు ఎస్సీ బాలుర హాస్టల్‌లో కింద పడుకున్న విద్యార్థులు



కురిచేడులో బీసీ హాస్టల్‌లో పక్కన పెట్టిన మంచాలు



చీమకుర్తి ఎస్సీ బాలికల హాస్టల్‌లో శిథిలమైన హాస్టల్ సీలింగ్ ఊడిపడుతున్న దృశ్యాలు



ఒంగోలు మంగమూరురోడ్డులోని బీసీ బాలుర వసతి గృహంలో తిరగని ఫ్యాను కింద నిద్ర

- యర్రగొండపాలెం నియోజకవర్గంలో మొత్తం 14 సాంఘిక సంక్షేమ హాస్టళ్లు ఉన్నాయి. హాస్టళ్లలో మెనూ సక్రమంగా అమలు చేయడం లేదు. కోడిగుడ్డు వారంలో కనీసం రెండు సార్లు ఇవ్వాల్సి ఉండగా ఎగనామం పెడుతున్నారు. తాగేందుకు నీళ్లు లేక విద్యార్థులు బోరు నీళ్లే తాగుతున్నారు. పెద్దారవీడులోని ఎస్సీ హాస్టల్‌లో 80 మంది విద్యార్థులకు 3 లీటర్ల పెరుగులో నీళ్లు కలిపి సరిచేస్తున్నారు. యర్రగొండపాలెంలో దాదాపు 35 ఏళ్ల క్రితం నిర్మించిన ఎస్సీ హాస్టల్ పూర్తిగా శిథిలావస్థకు చేరింది. విద్యార్థులు ఆరుబయటే స్నానాలు చేస్తుంటారు. రేకుల షెడ్డును అద్దెకు తీసుకొని బీసీ బాలుర హాస్టల్ నిర్వహిస్తున్నారు.
- దర్శి నియోజకవర్గంలో 8 ఎస్సీ, 7 బీసీ సంక్షేమ హాస్టళ్లు ఉన్నాయి. రెండు మూడు హాస్టళ్లకు కలిపి ఒకే వార్డెన్, వాచ్‌మెన్‌లే వంట మనుషులుగా పని చేయడం, రెండు హాస్టల్‌లకు ఒకే వాచ్‌మెన్‌లు పని చేస్తున్నారు. దొనకొండ మండలంలో బీసీ బాలుర వసతి గృహంలో బాత్‌రూంలు ఉన్నా నీటి వసతి లేదు. ముండ్లమూరు మండలంలోని మారెళ్ల ఎస్సీ హాస్టల్, తాళ్లూరు సాంఘిక సంక్షేమ హాస్టల్ లో విద్యార్థులకు మంచాలు లేక కిందే పడుకోవాల్సి వస్తోంది. మెనూ ప్రకారం ఆహారం అందడం లేదు.
- గిద్దలూరు నియోజకవర్గంలో 31 సంక్షేమ వసతి గృహాలు ఉన్నాయి.బేస్తవారిపేట, కంభం బీసీ హాస్టళ్లు అద్దె రేకుల షెడ్డులో నిర్వహిస్తున్నారు. టాయిలెట్స్‌కు రన్నింగ్ వాటర్ వసతిలేదు. అర్థవీడు మండలంలో మూడు హాస్టళ్లూ అద్దె భవనంలోనే ఉన్నాయి. బేస్తవారిపేట, అర్థవీడు, కంభం బీసీ హాస్టళ్లలో వాచ్‌మెనే వంట వండుతున్నారు. కొమరోలు మండలం అల్లీనగరం బీసీ వసతి గృహం, రాచర్ల మండలం అనుమలవీడు హాస్టల్ శిథిలావస్థకు చేరాయి.
- కనిగిరి నియోజకవర్గంలో ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు 26, కేజీబీవీలు 6, కాలేజీ హాస్టళ్లు 4 ఉన్నాయి. కనిగిరి పట్టణంలోని నాగులచెరువు సమీపంలోని కాలేజీ బాయ్స్ హాస్టల్ రేకుల గదుల్లో కిటికీలకు తలుపులు లేక, ఫ్యాన్లు తిరగక అవస్థపడుతున్నారు. మురుగునీరు బయటకు పోదు. రాత్రి పూట ప్రాంగణంలోకి పాములు తిరుగుతున్నాయి. కొత్తపేటలో బీసీ కాలేజీ హాస్టల్స్‌లో గదులన్నీ కారుతుండటంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. బీసీ బాలుర 2 వసతి గృహం అద్దె భవనం కావడంతో విద్యార్థులు రేకుల గదుల్లో పడుకున్నారు. అన్నం ముద్దగా ఉంది. దుప్పట్లు, కాస్మొటిక్ చార్జీలు ఇవ్వలేదు. బీసీ బాలుర 1 హాస్టల్‌లో మరుగుదొడ్లకు డోర్లు లేవు. పామూరు ఎస్సీ బాలుర హాస్టల్‌లో బెడ్స్ లేకపోవడంతో పిల్లలు కిందపడుకొని ఉన్నారు. సీఎస్ పురం మండలంలో ఒక్క హాస్టల్‌లో కూడా విద్యార్థులకు బెడ్స్‌లు లేకపోవడంతో కిందపడుకుంటున్నారు. హనుమంతునిపాడు ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థులు నేల పైనే పడుకోవాల్సి పరిస్థితి.
- మార్కాపురం నియోజకవర్గంలో మొత్తం 19 హాస్టల్స్‌ఉన్నాయి. కొనకనమిట్ల ఎస్సీ హాస్టల్ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నారు. తర్లుపాడులోని బీసీ హాస్టల్ అద్దె భవనంలో కొనసాగుతోంది. పొదిలి బీసీ హాస్టల్ కూలేందుకు సిద్ధంగా ఉంది. మార్కాపురం పట్టణంలోని ఎస్సీ కాలేజీ బాయ్స్ హాస్టల్‌లో విద్యార్థులకు సరిపడ గదులు, టాయిలెట్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.
- సంతనూతలపాడు నియోజకవర్గంలో 11 సంక్షేమ వసతి గృహాలున్నాయి. చీమకుర్తి ఎస్సీ బాలికల హాస్టల్ భవనం పాతది కావడంతో పైనుంచి సీలింగ్ ఊడిపడుతోంది. విద్యార్థినిలకు ప్రభుత్వం అందించే మెనూ ఏమాత్రం పాటించటం లేదు.
- సంక్షేమ శాఖ మంత్రి డోలబాల వీరాంజనేయ స్వామి సొంత నియోజకవర్గం కొండపిలో 13 సంక్షేమ హాస్టళ్లు ఉన్నాయి. వాటిలో 5 వసతి గృహాలు మూతపడగా, మరొకటి మూసేసేందుకు సిద్ధంగా ఉంది. సింగరాయకొండ ఎస్సీ బాలుర వసతి గృహంలో నీటి వసతి లేక విద్యార్థులు మంచినీటి క్యాన్‌లు మోయాల్సిన దుస్థితి ఉంది. మంచాలు లేక కింద పడుకుంటున్నారు. బీసీ బాలుర కాలేజీ వసతి గృహంలో వాటర్‌ప్లాంటు మరమ్మతులకు గురైంది. జరుగుమల్లి బీసీ బాలికల వసతి గృహంలో వాటర్ ప్లాంటు, బోరు పనిచేయక నిరుపయోగంగా ఉన్నాయి. వసతి గృహానికి సరఫరా చేసే చిక్కీలు నాశిరకంగా ఉన్నాయి. మద్దిపాడు మండలం లోని కాకర్ల ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థులు మంచాలు లేక నేలపై పడుకుంటున్నారు. టంగుటూరు బీసీ గురుకుల పాఠశాలలో బాత్‌రూమ్‌కు తలుపులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. మంచాలు లేక కింద పడుకుంటున్నారు.

క్లుప్తంగా

ఆగస్టు 7న చలో విజయవాడ

- తరలిరావాలంటూ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పిలుపు



చలో విజయవాడ వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఒంగోలు సిటీ: విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై ఆగస్టు 7వ తేదీ చలో విజయవాడ నిర్వహించి విద్యుత్ సౌధ వద్ద తలపెట్టిన ధర్నాకు జిల్లాలోని విద్యుత్ ఉద్యోగులు తరలిరావాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు డి.సూరిబాబు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో చలో విజయవాడకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, కానీ.. నేడు పట్టించుకోవడం లేదని విమర్శించారు. 2022 సంవత్సరం పీఆర్‌సీ అరియర్స్ చెల్లించాలని, అన్ని రకాల కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ.46,000గా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. నూతన స్విఫ్ట్ ఆపరేటర్లకు, వాచ్‌మెన్ నుంచి ప్రమోషన్ తీసుకున్న షిఫ్ట్ ఆపరేటర్లకు పాత ఆపరేటర్లతో సమానంగా జీతాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. రెగ్యులర్, కాంట్రాక్ట్ ఉద్యోగులందరికీ పెయిడ్ హాలిడేస్ గుర్తింపుచేయాలని కోరారు. బిల్ కలెక్షన్ ఏజెంట్లు, ఎస్పీఎం కార్మికులు, స్టోర్ హమాలీలకు కనీస వేతనాలివ్వాలన్నారు. ప్రమాదవశాత్తూ మరణించిన కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం మాదిరిగా కోటి రూపాయల నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ప్రమాదంలో గాయపడిన వారికి రిస్క్ అలవెన్స్, అన్‌లిమిటెడ్ వైద్య సౌకర్యం, కోలుకునే వరకు నష్టపరిహారం, సెలవులు ఇవ్వాలన్నారు. హెల్త్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కారుణ్య నియామకాలు చేపట్టాలని, కొత్తగా నిర్మించిన సబ్ స్టేషన్‌లో ఖాళీలను పూర్తి చేయాలని, అన్ని సబ్‌స్టేషన్లకు నైట్ వాచ్‌మెన్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు వేతన సవరణ చేయాలని, గత పీఆర్సీలో ఇంజినీర్లకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలని సూచించారు. ఈ సమస్యలు పరిష్కరించాలని అనేకసార్లు ప్రభుత్వానికి, యాజమాన్యానికి విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. వివిధ స్థాయిలో ధర్నాలు జరిగినా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం అన్యాయమన్నారు. ఈ నేపథ్యంలో చేపట్టిన రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి జిల్లాలోని వివిధ కేటగిరీలలో పనిచేస్తున్న పర్మినెంట్ ఉద్యోగులు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులంతా పెద్ద సంఖ్యలో హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు జీవీ కొండారెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ బాలుర హాస్టల్లో నిర్లక్ష్యం



ఒంగోలు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధిత విద్యార్థి ఆంజనేయులు



విద్యార్థులు మంటలు వేయటానికి వాడిన టర్పెంటైన్ ఆయిల్ బాటిల్



వసతి గృహం ఆవరణలో విద్యార్థులు మత్తు కోసం తెచ్చుకున్న సొల్యూషన్ ఉన్న కవర్లు

- ఆడుకుంటూ మంటల్లో పడి విద్యార్థికి గాయాలు

సింగరాయకొండ: ఎస్సీ బాలుర హాస్టల్లో సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా 8వ తరగతి విద్యార్థి ప్రమాదవశాత్తూ మంటల్లో పడి గాయపడ్డాడు. ఈ సంఘటన శుక్రవారం రాత్రి సింగరాయకొండలో జరిగింది. విద్యార్థుల కథనం మేరకు.. స్థానిక ప్రభుత్వ ఎస్సీ వసతి గృహంలో 8వ తరగతి చదువుతున్న హర్ష, అఖిల్, ఆంజనేయులు ముగ్గురూ శుక్రవారం రాత్రి భోజనం చేసిన తరువాత వసతి గృహంలో ఉన్న ఇసుక కుప్పల వద్దకు వెళ్లి సరదాగా ఆడుకుందామనుకున్నారు. ప్రస్తుతం వసతి గృహంలో సుమారు రూ.40 లక్షలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. బేల్దారి పనివారు ఉంచిన టర్పెన్‌టైన్ ఆయిల్ బాటిల్‌ను హర్ష, అఖిల్ తీసుకొచ్చి ఇసుకలో ఆ ఆయిల్‌తో పేరు రాసి వెలిగించారు. ఆ తరువాత ఆ మంటలను చూద్దామని అక్కడికి వేగంగా వచ్చిన ఆంజనేయులు ప్రమాదవశాత్తూ రాయి తట్టుకుని మంటలపై పడ్డాడు. దీంతో అక్కడున్న విద్యార్థులు వెంటనే విద్యార్థిని పక్కకు లాగారు. కానీ, అప్పటికే అతని చొక్కాకు మంటలు అంటుకోవటంతో ఓ విద్యార్థి చొక్కా చించి పెనుప్రమాదం జరగకుండా కాపాడాడు. అయితే, అప్పటికే మంటల తాకిడికి ఆంజనేయులు నడుము, కుడి చేయి మణికట్టు వద్ద గాయాలయ్యాయి. అతనిని తోటి విద్యార్థులు ప్రథమ చికిత్స కోసం సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేయించి మెరుగైన చికిత్స కోసం 108లో ఒంగోలు జీజీహెచ్‌కి తీసుకెళ్లారు. ప్రస్తుతం విద్యార్థి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది.

మత్తులో తూగుతున్న విద్యార్థులు...

వసతి గృహంలో విద్యార్థులు కొంతమంది పైపులకు అతుకులు వేసే సొల్యూషన్ తీసుకొచ్చి మత్తు కోసం పీల్చేవారని, ఎంత చెప్పినా వినేవారు కాదని వాచ్‌మెన్ ప్రసాద్ తెలిపారు. వీరు ఈ మత్తులో ఒక్కోసారి గతంలో ఇక్కడ పనిచేసిన వాచ్‌మెన్‌పై కూడా దాడి చేసేవారని అంటున్నారు. ఈ సొల్యూషన్ ఒక కవర్లో ఉంటుందని, ఒక్కో కవర్ సుమారు రూ.30 ఉంటుందని, వసతి గృహం సమీపంలోనే దొరుకుతుందని స్థానికులు తెలిపారు. ఈ మత్తు పదార్థం విషయమై ఎస్సై బీ మహేంద్రను వివరణ కోరగా, తనకు ఎప్పుడూ ఎటువంటి ఫిర్యాదులు రాలేదని, వారు చిన్నపిల్లలు కదా అని అన్నారు. ఇంత జరుగుతున్నా ఇన్‌చార్జి వార్డెన్ మునికుమార్ ఒక్కసారి కూడా వసతి గృహానికి వచ్చే వారు కాదని, ఇప్పటికి ఆయన వచ్చి సుమారు నెల రోజులవుతుందని విద్యార్థులు ఆరోపిస్తున్నారు.

సమాచారం చెప్పండి.. అప్పుడు వెళ్లండి...

గాయపడిన విద్యార్థిని తోటి విద్యార్థులు, వాచ్‌మెన్ ప్రసాద్ ఆస్పత్రికి తీసుకెళ్లిన సమాచారం తెలుసుకున్న సాంఘిక సంక్షేమ శాఖ డీడీ లక్ష్మానాయక్ హుటాహుటిన ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. అతను వచ్చేలోపు డాక్టర్లు విద్యార్థికి ప్రథమ చికిత్స చేసి ఒంగోలు జీజీహెచ్‌కి తరలించేందుకు 108 ఎక్కించారు. విద్యార్థి కాలిన గాయాలతో కేకలు పెడుతున్నాడు. కానీ, లక్ష్మానాయక్ మాత్రం ముందు జరిగిన ఘటన చెప్పిన తర్వాతే 108 కదిలించాలంటూ ఘటన వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేశారు. దీంతో సుమారు అరగంటసేపు ఆస్పత్రి వద్దే 108 ఆగి బాధిత విద్యార్థి నరకం చూశాడు.

అమలు కాని మెనూ...

వార్డెన్ పర్యవేక్షణ లేకపోవటంతో వసతి గృహంలో మెనూ సక్రమంగా అమలు కావడం లేదు. శుక్రవారం తాళింపు అన్నం, చికెన్ కర్రీ, గోంగూర చట్నీ, ఉడికించిన కోడి గుడ్డు, రైతా, మజ్జిగ, పండ్లు ఇవ్వాల్సి ఉండగా, కేవలం వైట్‌రైస్, టమోటా పప్పు, మజ్జిగ మాత్రమే పెట్టారు. శనివారం ఉదయం ఇడ్లి, వేరుశనగ చట్నీ పెట్టాల్సి ఉండగా, బయట బోండాలు కొనుక్కొచ్చి పెట్టారని విద్యార్థులు తెలిపారు. చికెన్ ఒక్కసారి కూడా తినలేదని, ఆ మాటే మరిచామని విద్యార్థులు అంటున్నారు. హాస్టల్ ఇన్‌చార్జి వార్డెన్ పట్టించుకోకపోవడం, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో హాస్టల్లో మెనూ అమలుకాకపోగా, విద్యార్థులు ప్రమాదాలకు గురవడం, మత్తు పదార్థాలు పీల్చడం వంటి వాటిపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



సొల్యూషన్ ఉన్న కవర్

ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించాలి



డీఈఓ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు



ఏడీకి వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

- యూటీఎఫ్ జిల్లా శాఖ డిమాండ్
- డీఈఓ కార్యాలయం వద్ద నిరసన

ఒంగోలు సిటీ: బదిలీలు, ప్రమోషన్లు ముగిసి రెండు నెలలైనా ఉపాధ్యాయుల క్యాడర్ స్ట్రెంక్త్, పొజిషన్ ఐడీలు లేకపోవడంతో రెండు నెలల నుంచి జీతాలు రాక ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని యూటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు ఆందోళన వ్యక్తం చేశారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హై అధ్యక్షతన ఒంగోలు డీఈఓ కార్యాలయం వద్ద శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలామంది ఉపాధ్యాయులు ఈఎంఐలు చెల్లించక బ్యాంకుల నుంచి రెండు నెలలుగా ఒత్తిడి వస్తోందన్నారు. కొందరు ఉపాధ్యాయులు బదిలీలైనా రిలీవర్ రాక అదే స్కూల్లో నిలిచిపోయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలన్నారు. జిల్లాలో ఖాళీగా ఉన్న సుమారు 600 ఎస్జీటీ పోస్టులను తాత్కాలికంగా అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించి పాఠశాలల్లో చదువుతున్న బడుగు బలహీన వర్గాల పిల్లల విద్యా ప్రమాణాలు కాపాడాలని కోరారు. ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాలు పెంచి మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని మండిపడ్డారు. విద్యా సంవత్సరం ప్రారంభం నాటి నుంచి యోగాంధ్ర, ఎస్ఎల్ ఎన్ లీడర్షిప్ ట్రైనింగ్, మెగా పీటీఎం, ఫొటోలు, వీడియోలు అప్లోడ్ చేయటం, విట్నెస్ అధికారులను నియమించడం, హ్యాండ్ బుక్‌ను రోజూ రాయడం, విద్యార్థులకు ప్లానిటేషన్ మొక్కలు పెంచే బాధ్యత అప్పజెప్పి వారి ఫొటోలను అప్లోడ్ చేయుట, సర్వేపల్లి రాధాకృష్ణ కిట్స్ విద్యార్థులతో బయోమెట్రిక్ వేయించడం, పాఠశాలకు నేరుగా బియ్యం అందక ఉపాధ్యాయులు క్లస్టర్ కేంద్రాలకు వెళ్లి బియ్యం తెచ్చుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. టెక్నాలజీ తెలియక ఉపాధ్యాయులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. యాప్‌లను రద్దు చేశామని చెప్పి అన్ని యాప్‌లను కలిపి ఒక యాప్‌లో పెట్టి గంటకు గూగుల్ సీటు, ఎక్సెల్ షీట్, రిపోర్టులు, చిక్కీ రిపోర్టులు, ఎగ్ రిపోర్టు, రైస్ రిపోర్టు, నాడు-నేడు స్పేస్ వన్ రిపోర్టు, వివిధ దినోత్సవాలు రిపోర్టులు మోస్ట్ అర్జెంట్ అని అడుగుతూ ఉపాధ్యాయులను ఆందోళన గురి చేస్తున్నారన్నారు. ఉపాధ్యాయులకు రావాల్సిన సుమారు 23 వేల కోట్ల రూపాయల్లో 11వ పీఆర్సీ బకాయిలు, సీపీఎస్ 90 శాతం బకాయిలు, సరెండర్ లీవ్ బకాయిలు, డీఏ బకాయిలు, మెడికల్ రియింబర్స్‌మెంట్ బకాయిలు ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు బాకీ ఉందన్నారు. 12వ పీఆర్‌సీ కమిషన్ వేసి ఐఆర్ ఇచ్చి తక్షణమే ప్రభుత్వం రూట్ మ్యాప్ ప్రకటించాలన్నారు. యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్.రవి, సహాధ్యక్షురాలు జి.ఉమామహేశ్వరి, కోశాధికారి ఎన్.చిన్నస్వామి, జిల్లా కార్యదర్శులు సీహెచ్ ప్రభాకరరెడ్డి, కె.వెంకయ్య, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కత్తి పద్మారావు రచనలు ఆదర్శనీయం



మాట్లాడుతున్న సీఐ మేడా శ్రీనివాసరావు

ఒంగోలు వన్‌టౌన్: దళిత మహాసభ వ్యవస్థాపకుడు డాక్టర్ కత్తి పద్మారావు జన్మదిన వేడుకలను కలెక్టరేట్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఒంగోలు టూటౌన్ సీఐ మేడా శ్రీనివాసరావు హాజరై మాట్లాడుతూ డాక్టర్ పద్మారావు అభినవ అంబేడ్కర్..అని కొనియాడారు. పద్మారావు సామాజిక ఉద్యమం, పోరాట స్ఫూర్తి, రచనలు ప్రతి ఒక్కరికీ ఆదర్శమన్నారు. వెంకట్ బీ, కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ కారంచేడు, చుండూరు మరణ హోమం చూసి చలించిపోయిన కత్తి పద్మారావు తన ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి దళిత ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దళిత ఉద్యమానికి పునాది వేశారన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం రూపుదిద్దుకోవడానికి కృషి చేశారని చెప్పారు. కార్యక్రమంలో చిట్టిమాల సంపత్ కుమార్, కందిపాటి వెంకట కృష్ణారావు, వి.నాగార్జున, కె. కృష్ణబాబు పాల్గొన్నారు.

ఆర్టీసీ స్థలాల లీజును రద్దు చేయాలి



ఒంగోలు డిపో వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న యూనియన్ నాయకులు

ఒంగోలు సిటీ: కార్పొరేట్ కంపెనీలతో ఆర్టీసీ ప్రభుత్వ స్థలాల లీజును రద్దు చేయాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.అయ్యప్పరెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు డిమాండ్ చేశారు. స్థానిక ఎస్‌డబ్ల్యూఎఫ్ ఒంగోలు డిపో కమిటీ ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపో వద్ద శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఒంగోలు డిపో నాయకుడు ఎస్‌కే మీరావలి అధ్యక్షత వహించగా, అయ్యప్పరెడ్డి, కాలం సుబ్బారావు మాట్లాడుతూ ఆర్టీసీ స్థలాలను కార్పొరేట్ వ్యక్తులకు, బడా కార్పొరేట్ సంస్థలకు షాపింగ్ మాల్స్‌కి అప్పజెప్పే విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బ్యాంకులు, ఎల్ఐసీ, ఇతర ప్రభుత్వ ఆస్తులు, స్థలాలను కారుచౌకగా కార్పొరేట్ శక్తులకు అప్పజెబుతున్నాయన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం కూడా అదే తరహాలో ప్రభుత్వ స్థలాలను కారు చౌకగా అమ్మడం, 90 పైసలకు లీజుకు ఇవ్వడం చేస్తోందని విమర్శించారు. కార్పొరేట్ సంస్థలకు, ప్రైవేటు శక్తులకు ప్రభుత్వ ఆస్తులు అప్పజెప్పడం ద్వారా ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. ఈ విధానం సరైనది కాదని, వెంటనే ప్రభుత్వ రంగ స్థలాలను కాపాడాలని, వాటి ద్వారా ప్రభుత్వ సంస్థలకు సదుపాయాలు, సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపోలలో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీ కార్మికులు, ప్రజల భాగస్వామ్యంతో ఈ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ ఒంగోలు నగర కార్యదర్శి టి.మహేష్, ఎస్‌డబ్ల్యూఎఫ్ రీజినల్ జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసరావు, ఒంగోలు డిపో అధ్యక్ష, కార్యదర్శులు యు.హరిబాబు, కె వెంకటేశ్వర్లు సీఐటీయూ నగర ఉపాధ్యక్షులు తంబి శ్రీనివాసులు, జి.రమేష్, ఒంగోలు డిపో నాయకులు వీరాస్వామి, ఆర్.జగన్మోహన్‌రావు, కే సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 20 నుంచి ప్రజా కళా ఉత్సవాలు



మాట్లాడుతున్న ఏపీ ప్రజా నాట్యమండలి నాయకులు

ఒంగోలు సిటీ: ఒంగోలులో జరగనున్న సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలను పురస్కరించుకుని ఏపీ ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో ఆగస్టు 20 నుంచి 25వ తేదీ వరకు ప్రజా కళా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఏపీ ప్రజానాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న), రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్ర నాయక్, చిన్నం పెంచలయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్.రామకృష్ణ తెలిపారు. ప్రజా కళా ఉత్సవాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. శనివారం ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో ఏపీ ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించి వారు మాట్లాడారు. భారత కమ్యూనిస్టు పార్టీ 100 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వెయ్యి మంది కళాకారులు, 100 గొంతుకలు నినాదంతో ఈ ప్రజా కళా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రజా కళా ఉత్సవాలకు శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం, తిరుపతి, కర్నూలుతో పాటుగా రాష్ట్రంలోని 23 జిల్లాల నుంచి దాదాపు 1000 మంది కళాకారులు హాజరవుతారని వెల్లడించారు. చెక్కభజనలు, తప్పెడుగుండ్లు, గిరిజన నృత్యాలు, ధింసా, గురవయ్యలు, 100 మంది కోలాట కళాకారులు, విచిత్ర వేషాలతో కళాకారులు తమ సందేశాత్మక, అభ్యుదయ ప్రదర్శనల ద్వారా ప్రజలకు చైతన్య పరచనున్నట్లు వివరించారు. సినీ, నాటక రంగ ప్రముఖులు, సాహితీవేత్తలు, కళాకారులు గోరటి వెంకన్న, వందేమాతరం శ్రీనివాస్, జై రాజ్, మాదాల రవి, తమ్మారెడ్డి భరద్వాజ, బాబ్జి, అజయ్ ఘోష్ వంటి ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రజలు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీ ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు ఆర్.పిచ్చియ్య, ఏ రామారావు, ఎస్‌కే నజీర్, వి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు వెనక్కి తీసుకోండి



ఒంగోలు నగరంలోని గోపాల్ నగర్‌లో ఇంటింటికీ తిరిగి స్మార్ట్ మీటర్లపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు

- సెకీ ఒప్పందాన్ని రద్దుచేసి.. విద్యుత్ చార్జీలు తగ్గించాలి
- ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జోరుగా ప్రచారం

ఒంగోలు సబర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ రంగం ప్రవేటీకరణలో భాగంగా అదానీ కంపెనీతో జరిగిన స్మార్ట్ మీటర్ల బిగింపు, సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ మేరకు ఒంగోలు నగరంలోని గోపాల్ నగర్ తదితర ప్రాంతాల్లో వీధి.. వీధీ తిరిగి స్మార్ట్ మీటర్ల వల్ల అనర్థాల గురించి జోరుగా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కొత్తకోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇప్పటికే బిగించిన స్మార్ట్ మీటర్లు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారంలో ఏ ప్రభుత్వం ఉన్నా ప్రజల నెత్తిన రూ.లక్షల కోట్ల భారాన్ని మోపుతూ, ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయడం లేదని ధ్వజమెత్తారు. ట్రూ అప్ చార్జీలు, అదనపు సర్దుబాటు చార్జీల పేరిట రూ.15,484 కోట్ల భారాన్ని ప్రజలపై మోపుతూ మళ్లీ స్మార్ట్ మీటర్ల పేరిట షాక్ తగిలేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవటం అత్యంత దారుణమన్నారు. స్మార్ట్ మీటర్ల బిగింపును తక్షణం ఆపాలని, ట్రూ అప్ చార్జీలు, ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై భారాలు రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జూలై 23 నుంచి 29 వరకు ఇంటింటి ప్రచారం, సంతకాల సేకరణ, జూలై 30 నుంచి ఆగస్టు 4 వరకు సభలు, సమావేశాలు, ప్రదర్శనలు, ఆగస్టు 5న విద్యుత్ కార్యాలయాల వద్ద ధర్నాలు జరుగుతాయని వివరించారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాల్లో ప్రజలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు రాజశేఖర్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు, నగర కార్యదర్శి పీ మహేష్, ఏఐఎఫ్‌టీయూ (న్యూ)సాయి, సుబ్బారావు, సీఐటీయూ నాయకులు తంబీ శీను, ఏఐటీయూసీ నాయకులు సలార్, ఐఎఫ్‌టీయూ నగర నాయకులు మోజేష్, వెంకట్రావు, సీఐటీయూ నాయకులు జీ రమేష్, వీరాస్వామి, సీహెచ్ రాంబాబు, బీవీ రావు, బి.భావ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా జాబ్ మేళా

మద్దిపాడు: స్థానిక కడియాల యానాదయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 27వ తేదీ మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జే రవితేజ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాబ్‌మేళాలో పదికిపైగా బహుళ జాతి కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. జిల్లాలోని 18 నుంచి 30 సంవత్సరాల మధ్య గల పదో తరగతి నుంచి పీజీ వరకూ చదువుకుని ఖాళీగా ఉన్న నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపికైన వారికి నెలకు రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకూ జీతం లభిస్తుందని తెలిపారు. వివరాలకు 9963005209 సెల్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన పీడీ

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): సంతనూతలపాడులోని వడ్డెరపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో గల నాలుగో అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సువర్ణ తనిఖీ చేశారు. చిన్నారుల బరువు, ఎత్తును కొలిపించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారం ద్వారా చిన్నారులు ఒకపక్క ఎదుగుదల, మరొక పక్క ఆటపాటలతో కూడిన విద్య పొందాలని ప్రాజెక్ట్ డైరెక్టర్ సువర్ణ సూచించారు. ఎర్లీ చైల్డ్ ఎడ్యుకేషన్ డేలో భాగంగా చిన్నారుల ఎదుగుదల, తదితర వాటిపై ఆమె సమీక్షించారు. తల్లులు తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించి నాణ్యమైన పౌష్టికాహారంతో పాటు ఆటపాటలతో కూడిన విద్య పొందాలని కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ మద్దిపాడు సీడీపీఓ ఇవాంజిలిన్, సంతనూతలపాడు సూపర్‌వైజర్ సావిత్రి, టీచర్ పద్మావతి, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.